సమాచారం

అంబర్‌పేట్‌లో ట్రాఫిక్ మళ్లింపు

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. పిల్లర్ నెంబర్ 24 నుంచి 26 వరకు నిర్మిస్తున్నందున మార్చి 10 వరకు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ఉంటాయని ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఆదివారం ప్రకటించారు. ఉప్పల్ నుంచి వచ్చే వాహనాలు హబ్సిగూడ చౌరస్తా, తార్నాకా, ఉస్మానియా యూనివర్సిటీ అడిక్‌మెట్, ఫీవర్ ఆసుపత్రి, కాచిగూడ మీదుగా చాదర్‌ఘాట్ నుంచి ఎంజీబీఎస్‌కు చేరుకోవాలన్నారు. ఆర్టీసీ, ఇతర వాహనాలు అంబర్‌పేట గాంధీ చౌరస్తా నుంచి లెఫ్టటర్న్ చేసుకుని పోలీస్ లేన్ నుంచి అలీకేఫ్ చౌరస్తా, గోల్నాకా, చాదర్‌ఘాట్ మీదుగా వెళ్లాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ సమాచారాన్ని గమనించాలన్నారు.

నేడు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ఉచిత వైద్య శిబిరం

చిక్కడపల్లి: క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు గాంధీనగర్ జనప్రియ అబోడ్స్‌లో నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్. హిప్నో పదాకమలాకర్, ఎం.రమాదేవిరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం వారు మాట్లాడుతూ.. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో లయన్స్‌క్లబ్ నవభారత్ 320ఎ, 320డీ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. గర్భాశయ స్క్రీనింగ్ డిజిటల్ మమోగ్రామ్, సోనే మామోగ్రామ్, పాప్‌స్మర్, అల్ట్రాసౌండ్ ఉదరం, డెంటల్ 5 రకాల టెస్టులను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. లయన్స్‌క్లబ్ గవర్నర్‌లు జూలూరు రఘు, కోటేశ్వరరావు, డాక్టర్ ప్రకాష్, యాదయ్య, గోపాలకృష్ణలు శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ప్రజలు ఈ శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు.

టీ- 20 ఫ్రెండ్‌షిప్ కప్‌లో విద్యుత్ సౌధ జట్టు గెలుపు

అంబర్‌పేట: టీ-20 ఫ్రెండ్‌షిప్ కప్‌లో విద్యుత్ సౌధ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం అంబర్‌పేట్ జలమండలి క్రికెట్ మైదానంలో తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీస్ జట్టు, విద్యుత్ జలసౌధ జట్ల మధ్య టీ-20 ఫ్రెండ్‌షిప్ క్రికెట్ కప్ జరిగింది. సివిల్ సర్వీసెస్ జట్టు ఆయా ఓవర్లలో 151/6 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విద్యుత్ సౌధ జట్టు 18.5 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించింది. ఈ టోర్నమెంట్‌లో సివిల్ సర్వీసెస్ జట్టు ఓపెనింగ్ బ్యాడ్స్‌మెన్ వంశీమోహన్‌రెడ్డి 82 పరుగులు చేసి అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు.

అనాథలకు ప్రత్యేక సంక్షేమశాఖను ఏర్పాటు చేయాలి

కాచిగూడ: అనాథలకు ప్రత్యేక సంక్షేమశాఖ, ప్రత్యేక కమీషన్, ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర అనాథల హక్కుల పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొక్క వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, గవర్నర్, సీఎంలకు వినతిపత్రాలు అందజేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు ఎస్సీ సంక్షేమశాఖ, శిశు సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖల్లో ఉన్నారని దీని ద్వారా వారికి సంపూర్ణ న్యాయం జరగడం లేదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో అనాథల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సునార్‌బౌలీ వాసులు

అంబర్‌పేట: నియోజకవర్గంలోని పార్కుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం అంబర్‌పేట్ డివిజన్‌లో ప్రజా సమస్యలపై పర్యటిస్తున్న ఎమ్మెల్యేను ప్రేమ్‌నగర్ సునార్‌బౌలి వాసులు కలిసి ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన ఇప్పటికే నియోజకవర్గంలోని పలు పార్కులను అభివృద్ధి చేశామన్నారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుందని సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్‌లాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం తార్నాక డివిజన్ లాలాపేట సాయినగర్‌లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 5 ఏళ్ల క్రితం సాయినగర్‌లో మూడు బ్లాకులుగా 107 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని, నేటికి ఒక్క బ్లాక్ సైతం పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో పాటు ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేకపోవడం సాయినగర్ వాసులకు శాపంగా మారిందన్నారు. ఇళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారో లబ్ధిదారులకు చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్‌జీటీ స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ నేతలు, ఉపాధ్యాయులు

కవాడిగూడ: రాష్ట్రంలోని 13 జిల్లాల్లో గత 13 నెలలుగా తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఎస్‌జీటీ స్పౌజ్ (భార్యభర్తల) బదిలీలను చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షైకత్‌అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరా పార్కు వద్ద ఉపాధాయ్యులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 13 నెలలుగా ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడుతూ వారి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ అసిస్టెంట్ దంపతులను మార్చినట్లుగానే తమను మార్చాలని కోరారు. ఎమ్మెల్సీ ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలని సూచించారు. నాలుగు వేల ఖాళీలు ఉన్నాయని వాటిలో తమనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అసోసియేషన్ నేతలు నాగరాజు, బాలరాజు, విజయలక్ష్మి, రజిత, షబానాతో పాటు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పిల్లలే నిజమైన ఆస్తి



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మనకు ఎంత సంపద ఉన్నా వృథా అని పిల్లలే మనకు నిజమైన ఆస్తి అని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధిలో గురువులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. సమాజంలోని చెడు ప్రభావం పిల్లలపై పడకుండా తల్లిదండ్రులు తగిన మార్గదర్శకత్వం చేయాలని సూచించారు. ఆదివారం చిక్కడపల్లి సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ తల్లిదండ్రుల సమావేశాన్ని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గతంలో తల్లిదండ్రులను చూసి పిల్లలు భయపడే వారని, ప్రస్తుత కాలంలో పిల్లలకే తల్లిదండ్రులు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సామాజిక అంశాలపై ఏది మంచో ఏది చెడో చెప్పకపోవడం వల్ల పిల్లలు వ్యసనాలకు బానిసవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను అదిగమించాలంటే తల్లిదండ్రులు పిల్లల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ నుంచి దూరం చేయడానికి పిల్లలను పుస్తకాలకు చేరువ చేయాలన్నారు. తద్వారానే వారికి చదువు పట్ల ఆసక్తి పెరుగుతోందన్నారు. నేటి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఈ క్రమంలో వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రధాని ఈ- వేస్ట్‌పై స్పందించడం అభినందనీయం



కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తదితరులు



మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న పార్థసారధి తదితరులు

చిక్కడపల్లి: ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్‌లో భాగంగా ఈ- వేస్ట్‌పై స్పందించడం అభినందనీయమని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లో ప్రధాని 97వ భాగం మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బూత్ నంబరు 131, 132, 133లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, నియోజవర్గ ముఖ్యనాయకులు ప్రభారి సూర్యనారాయణలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో మొదటి ఏపిసోడ్‌గా నూతన సంవత్సర శుభాకాంక్షలతో మొదలైన ప్రసంగం భారత అభివృద్ధిపై కొన్ని గొప్ప విషయాలను వ్యక్తపరిచారన్నారు.

చిరుధాన్యాల వాడకంపై ప్రధాని ప్రసంగం..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిరుధాన్యాల వాడకంతోనే ఆరోగ్యాలు మెరుగుపడతాయని భారత ప్రధాని నరేంద్రమోదీ సూచించినట్లు బీజేపీ సీనియర్ నాయకులు పార్థసారధి తెలిపారు. ఆదివారం సుందరయ్య పార్కు వద్ద పార్థసారధి ఆధ్వర్యంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని చేసిన ప్రసంగం ప్రజల్లో చైతన్యం వస్తుందన్నారు. రోజురోజుకు చిరుధాన్యాల వాడకం పెరుగుతుందని ఈ చిరుధాన్యాల వల్లే ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రముఖ వైద్యులు కే.వీ.రామసుబ్బారెడ్డి సూచించారన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షులు అరుణ్‌కుమార్, నాయకులు జైపాల్‌రెడ్డి, బాబు, వేణుగోపాల్, శీలం ప్రవీణ్, ఉడతల బాలకృష్ణ, రాంమోహన్, కిరణ్‌యాదవ్ తదితరులున్నారు.

మన్‌కీబాత్‌ను వీక్షించిన బీజేపీ నేతలు..

అంబర్‌పేట: ప్రధాని నరేంద్రమోదీ మాన్‌కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీనేతలు ప్రత్యేకంగా వీక్షించారు. ఆదివారం గోల్నాకలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గౌతమ్‌రావు హాజరై ప్రధాని మన్‌కీ బాత్‌ను ప్రత్యేకంగా తిలకించారు. ఆయనతో పాటు బీజేపీ నేతలు రవీందర్‌గౌడ్, నర్సింగ్ రావుయాదవ్, రమేష్, అజయ్‌సింగ్, బాల్‌రాజ్, భాస్కర్ తదితరులున్నారు.

- బాగ్‌అంబర్‌పేట్‌లో కార్పొరేటర్ పద్మావెంకట్ రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి చుక్క జగన్ తదితరులు మన్‌కీ బాత్‌ను వీక్షించారు.
- జనవరి శీతాకాలంలో మంచుతో కప్పబడిన జమ్ముకాశ్మీర్ అందాలను పర్యాటక భూతల స్వర్గంగా అభివర్ణించారన్నారు.
- దేశ వ్యాప్తంగా చిరుధాన్యాల ఉత్పత్తి అభివృద్ధి చెందిందని ప్రధాని పేర్కొన్నారని దేశ జనాభాలో నిత్యావసర వస్తువుగా మారిన మొబైల్, ల్యాప్‌టాప్ లాంటి పలు ఆధునిక టెక్నాలజీతో తయారైన ఎల్రక్టానిక్ వస్తువులను వాడిన తర్వాత సరైన పద్ధతిలో డిస్మెటల్ చేయకుండా పారవేయటం ద్వారా ఘోరమైన పర్యావరణ కాలుష్యం దేశవ్యాప్తంగా పెరిగిపోతుందని ప్రధాని వాపోయారన్నారు.
- ప్రతి ఏటా 50 మిలియన్‌ల టన్నుల వ్యర్థాలను మన దేశంలో చూస్తున్నామని ప్రధాని చెప్పారన్నారు. పలు అంశాలపై ప్రజలకు దిశానిర్దేశం చేయాలని ప్రధాని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఆనంద్‌రావు, డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, బూత్ అధ్యక్షులు సంపత్‌యాదవ్, నితీష్‌కుమార్, మదన్మోహన్, సాయికుమార్, సంతోష్, రాహుల్, సాయితేజ, ధీరజ్, శశాంక్, డేవిడ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

గౌడల అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తా



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గౌడల అభివృద్ధి కోసం తనశక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం గౌడ జన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకువస్తున్నారన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నీరా భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కేసీఆర్ సహకారంతో తాటి, ఈత చెట్లకు రెంటల్ రద్దు, గీత వృత్తిదారులకు రూ.2 వేల పింఛన్, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యక్షులు చంద్రం దుర్గాగౌడ్, కె.అంజనేయులుగౌడ్, యాదగిరిగౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ జాతీయ కన్వీనర్ బీ.డీ.ఏ.సత్యబోస్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం చిక్కడపల్లిలో తెలంగాణ అగ్రినెట్‌వర్క్, సీబీజీఏ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కనీసం 10 శాతానికి పైగా నిధులు కేటాయించాలన్నారు. కనీస మద్దతు ధర కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పూర్తి సబ్సిడీతో విత్తనాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ప్రసాద్, రైతు సంఘం నాయకులు శోభన్‌నాయక్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, సీబీజీఏ సమన్వయ కర్త తురుపంగ శివలింగం, సోమ శేఖర్, శ్రీనివాసులు తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి నేతల చేరిక



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: బీఆర్ఎస్ పార్టీలో చేరినవారికి సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం గోల్నాకలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బాగ్‌అంబర్‌పేటకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం పార్టీలకు చెందిన యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై అన్ని పార్టీల నేతలు పార్టీలోకి రావడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ముషీరాబాద్: మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాలని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పీఓడబ్ల్యూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరళ, భారతీలు అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పీఓడబ్ల్యూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

నూతన కార్యవర్గం..

- నూతన అధ్యక్షురాలిగా సరళ, ప్రధాన కార్యదర్శిగా భారతి, ఉపాధ్యక్షురాలుగా పద్మ, బండారు విజయ, సహ కార్యదర్శులుగా జయసుధ, అనిత, కోశాధికారిగా పుణ్యవతి, 23 సభ్యులతో కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్త్రీ పురుష సమానత్వంపై పోరాడుతామని మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా తామంతా ముందుండి ఉద్యమిస్తామన్నారు.

బెల్లం మాధవికి ' మలేషియా తెలుగు సేవా పురస్కారం'



కాచిగూడ: మలేషియా తెలుగు సంఘం సంక్రాంతి సంబరాల సందర్భంగా మలేషియాలోని 'ఈ లైబ్రరీ మజ్లిస్ పెరుబందరన్ క్లంగ్'లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రిబాయిపూలే ఫౌండేషన్ చైర్మన్ బెల్లం మాధవి మలేషియా తెలుగు సేవా పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా అధ్యక్షుడు డాక్టర్ వెంకట ప్రతాప్, ఎంపీ గణపతిరావు, క్లంగ్ శాఖ చైర్మన్ ఆర్.సుబ్రహ్మణ్యంలు ఈ అవార్డును ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా బెల్లం మాధవి మాట్లాడుతూ.. ఈ పురస్కారం అందుకోవడం ద్వారా తనపై బాధ్యత మరింత పెరిగిందని తనకు అవార్డు అందజేసిన మలేషియా తెలుగు సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.

మారణాయుధంతో సంచరిస్తున్న యువకుడికి జైలు శిక్ష

చిలకలగూడ: మారణాయుధంతో సంచరిస్తున్న యువకుడికి 30 రోజులు జైలు శిక్ష పడింది. చిలకలగూడ సీఐ నరేష్, డీఐ నాగేశ్వరరావు, డీఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పార్శిగుట్టకు చెందిన పాత నేరస్థుడు రవికుమార్ (22) అర్ధరాత్రి దాటిన తర్వాత కత్తి వంటి మారణాయుధంతో సంచరిస్తూ నేరాలకు పాల్పడుతుంటాడు. శనివారం వేకువజామున గాంధీ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గస్తీ పోలీసులు అదుపులోకి తీసుకుని మారణాయుధాన్ని స్వాధీనం చేసుకుని, సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా 30 రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు రవికుమార్‌ను చంచలగూడ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గిరిజనుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్‌లో భజరంగ్ బంజారా సేవా సంఘం గిరిజనుల హక్కులపై జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బంజారాలకు బంజారాహిల్స్‌లో అన్ని హంగులతో ఆత్మగౌరవ భవనం నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. నియోజకవర్గంలోని గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థముదిరాజ్, నాయకులు మహేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ ఎస్టీసెల్ అధ్యక్షులు రమేష్‌నాయక్, వీరన్ననాయక్, రమేష్‌నాయక్, చందర్‌నాయక్ తదితరులున్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో రజకులకు అధిక నిధులు కేటాయించాలి



రజకుల సమావేశంలో మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2023-24లో రజక వృత్తిదారుల సంక్షేమానికి రూ.1000 కోట్లు కేటాయించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2014లో నిర్వహించి సమగ్ర సర్వే ప్రకారం పది లక్షలకు పైగా రజకులు ఉన్నారని 80 శాతం మంది వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అత్యంత వెనుకబడిన రజకులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం అధ్యక్షుడు గుమ్మడిరాజు నరేష్, ఉపాధ్యక్షులు బాలకృష్ణ, నాయకులు మల్లేష్, నవీన్, శంకర్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న గణేష్, ప్రదీప్‌కుమార్‌లు

చిక్కడపల్లి: భక్తి సాహిత్య సాంస్కృతిక పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్, ఫిల్మ్ అండ్ టీవీ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ నిర్వహణలో తులసిభవన్‌లో ప్రతిభావంతులైన కళాకారులు, అధ్యాపకులను ఆదివారం సాయంత్రం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యగణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ 80 ఏళ్లలోనూ కళపై ఆసక్తిని వదులుకోలేక తాను నటిస్తూ యువతను ప్రోత్సాహిస్తున్నారన్నారు. నాట్యగురువు రత్నశ్రీ, నటులు వేంకటాచారి జంగయ్యగౌడ్, పద్మప్రియ అశోక్‌కుమార్ గాయని వీ.కె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారంతోనే పర్యావరణ పరిరక్షణ

సీపీఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి రామకృష్ణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పర్యావరణ పరిరక్షణ విస్తృత ప్రచారంతోనే సాధ్యమవుతుందని సీపీఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ రూపొందించిన 2023 నూతన కేలండర్‌ను సంస్థ అధ్యక్షుడు ఎస్.హెచ్.రంగయ్య ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో రామకృష్ణ, ఆ పార్టీ జాతీయ నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులతో కలిసి అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ.. నేడు వృక్ష సంపద కుంచించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కలు నాటి భర్తీ చేయాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. పర్యావరణంపై ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంస్థ దృష్టి కోణాన్ని పలువురు అభినందించారు.

బీసీ కులాల వారీగా జనగణన చేపట్టాలి



మాట్లాడుతున్న బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్

కాచిగూడ: బీసీ కులాల వారీగా జనగణనను బీహార్ తరహాలో చేపట్టాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. బీసీ కులగణనను చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం కాచిగూడ, మోతిమార్కెట్‌లోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణనను చేపట్టకపోవడంతో బీసీ కులాల వారీగా రిజర్వేషన్లు అమలు కావడం లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు సరిగ్గా జరగడం లేదని దేశంలో 70 కోట్ల మంది ఉన్న బీసీల అభివృద్ధికి జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయించకుండా కేంద్రం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. నల్లెల కిషోర్, ప్రదీప్‌గౌడ్, భూషణ్ భాస్కర్, ప్రశాంత్ నిమ్‌కర్, ధీరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



చిన్నారులతో శంకరం వేదిక అధ్యక్షురాలు యలమర్తి ధనలక్ష్మి



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

నల్లకుంట: రథసప్తమిని పురస్కరించుకుని ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లకుంట శంకర మఠం ప్రాంగణంలో కూచిపూడి శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆదివారం సాయంత్రం శ్రీవాణి నృత్యనికేతన్ విద్యార్థులు వినాయక స్తుతి, తులజా శబ్దం, అన్నమయ్య కీర్తన, శ్రీరామ పట్టాభిషేకం తదితర నృత్యాలు ప్రదర్శించి అలరించారు. ముఖ్య అతిథిగా హాజరైన శంకరం వేదిక అధ్యక్షురాలు యలమర్తి ధనలక్ష్మి నృత్య కారులకు జ్ఞాపికలు అందజేసి శాలువాతో సన్మానించి మాట్లాడారు. చిన్నారులకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే శాస్త్రీయ నృత్యం నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఈ సందర్భంగా అభినందించారు. శంకరమఠం నల్లకుంట బ్రాంచ్‌హెడ్ కృష్ణారావు, ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి, కన్వీనర్ రఘుశ్రీ, వాణి నృత్య నికేతన్ నాట్య గురువు శ్రీవాణి తదితరులున్నారు.